సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 14 । నవంబర్ । 2023



ఆహ్లాదం.. కార్తీక విహారం

కార్తీకమాసంలో పర్యాటక ప్రాంతాలకు యాత్రికుల తాకిడి ఎక్కువే. ఆధ్యాత్మిక, ఆహ్లాదకరమైన ప్రదేశాలు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అనేకం ఉన్నాయి. 8లో ▸



దోపిడీ యత్నం కేసులో అరెస్టు

తణుకు మండలం వేల్పూరులో ఈ నెల 8న జరిగిన దోపిడీ యత్నం కేసులో యూపీకి చెందిన ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. 8లో ▸



దళితులపై దాడికి శిక్షలు తప్పవు

దళితులపై దాడి చేస్తే కఠిన శిక్షలు తప్పవని ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనంద్ ప్రకాష్ అన్నారు. చినకాపవరంలో గాయపడిన దళితులను పరామర్శించారు. 8లో ▸

న్యూస్‌రీల్

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



గ్రంథాలయ వారోత్సవాలు వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14న మంగళవారం బాలల దినోత్సవం నిర్వహించడంతో ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ వాల్ పోస్టర్లను మంత్రి కొట్టు సత్యనారాయణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వారోత్సవాలు 20 వరకు జరుగుతాయని తెలిపారు. 15న యుద్ధనపూడి జయంతి, మాదక ద్రవ్యాలపై అవగాహన, వ్యాసరచన పోటీలు, 16న క్విజ్ పోటీలు, 17న కవి సమ్మేళనం, చిత్రలేఖన పోటీలు, 18న వ్యాసరచన పోటీలు, 19న జాతీయ మహిళా దినోత్సవం, 20న ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్నట్లు వివరించారు. విశ్రాంత ఎంఈఓ ఎస్.సాల్మన్‌రాజు, సోషల్ వర్కర్ జాన్‌బాబు, విశ్రాంత పీఎల్‌ఓ కొత్తపల్లి వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించాలి



భీమవరంలో నిర్వహించిన స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: పోలీసు స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను చట్టప్రకారం విచారణ చేసి ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిని పరిష్కరించాలని ఎస్పీ యు.రవి ప్రకాష్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం భీమవరం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఎస్పీ రవిప్రకాష్, ఏఎస్పీ వీవీ సుబ్బరాజు ఫిర్యాదులను స్వీకరించారు. స్పందనలో జిల్లా నలుమూలల నుంచి తొమ్మిది ఫిర్యాదులు అందగా వాటిలో ఎక్కువగా వరకట్న వేధింపులు, సరిహద్దు గొడవలు, సివిల్ వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులున్నాయన్నారు.

కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక బస్సులు

నరసాపురం: కార్తీక మాసం పురస్కరించుకుని నరసాపురం బస్టాండ్ నుంచి పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్. సుబ్బన్నరెడ్డి చెప్పారు. ఈ నెల 19, 26 వచ్చే నెల 3, 10 తేదీల్లో సోమవారాల్లో పంచారామ క్షేత్రాల్లో దర్శనాలు చేసుకునేలా బస్సులు తిప్పుతున్నామని చెప్పారు. శబరిమల యాత్రికులకు అద్దె ప్రాతిపదికన బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. కార్తీకమాసంలో విహార యాత్రలకు వెళ్లేవారికి బస్సులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఒక గ్రామంలో 40 మంది ఉంటే తమకు సమాచారం ఇస్తే నేరుగా ఆయా గ్రామాలు బస్సులు పంపిస్తామని చెప్పారు.

వైభవంగా శ్రీవారికి దీపావళి ఉత్సవం



శ్రీవారి ఆలయంలో స్వామివారి వాహనం ముందు కాలుస్తున్న బాణసంచా

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో స్వామి, అమ్మవార్లకు దీపావళి ఉత్సవాన్ని సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. క్షేత్ర పురవీధుల్లో జరగాల్సిన ఈ ఉత్సవం కొన్ని అనివార్య కారణాలు వల్ల కోవెలకే పరిమితమైంది. ముందుగా ఆలయ అర్చకులు శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను తొళక్క వాహనంపై ఉంచి విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం పూజాధికాలు జరిపి, హారతులిచ్చారు. ఆ తరువాత మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, బాణసంచా కాల్పుల నడుమ స్వామివారికి కోవెల ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపారు. ఈ వేడుకలో పాల్గొన్న ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు సతీమణి భాగ్యలక్ష్మి భక్తులతో కలసి ఆలయంలో దీపాలు వెలిగించారు.



పాలకొల్లులో కాంతులీనుతున్న క్షీరారామలింగేశ్వరస్వామి వారి ఆలయం

● కార్తీక కాంతులు

పరమ పవిత్రమైన కార్తీక మాసోత్సవాలకు శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. అభిషేక ప్రియుడైన ఆ పరమేశ్వరుడిని ప్రసన్నం చేసుకునేందుకు, ఆదిభిక్షువు సేవలో తరించేందుకు భక్తులు సన్నద్ధమయ్యారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పంచారామ క్షేత్రాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి. విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్నాయి. - భీమవరం (ప్రకాశం చౌక్)/పాలకొల్లు సెంట్రల్



భీమవరంలో ఉమా సోమేశ్వరస్వామి ఆలయం



సోమారామంలో ధ్వజస్తంభం వద్ద విద్యుద్దీపాలంకరణ

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

- వారం పాటు ప్రత్యేక కార్యక్రమాలు
- విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు
- నిధులు మంజూరు చేసిన గ్రంథాలయ సంస్థ



ఏలూరులో జిల్లా కేంద్ర గ్రంథాలయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గ్రంథాలయాలు విజ్ఞాన దేవాలయాలు.. గతంలో స్వాతంత్ర్య పోరాటానికి, ఉద్యమ కార్యాచరణకు వేదికలుగా నిలిచి ఎంతో మందిని విప్లవ మార్గంలో నడిపి దేశానికి స్వాతంత్ర్యం రావడంలో కీలక పాత్ర పోషించాయి. అనంతర కాలంలో సమాజానికి మంచి నేస్తాలుగా పని చేశాయి. అక్షరాస్యత తక్కువగా ఉన్న నాటి కాలంలో ప్రజల్లో చదువుకు ఉన్న విలువలను తెలుపుతూ వారిలో పఠనాసక్తిని రేకెత్తిస్తూ ఎంతోమందిని విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో కూడా గ్రంథాలయాల పాత్ర ప్రశంసనీయమనే చెప్పాలి. ప్రస్తుతం గ్రంథాలయాలకు వెళ్ళే వారి సంఖ్య తగ్గుతున్నా వాటి ప్రాధాన్యత తగ్గలేదు. నేటి కాలంలో గ్రంథాలయాలు తమ ఉనికిని చాటుకుంటూ మారిన కాలానికి తగ్గట్టుగా సేవలను కూడా మార్చుకుంటూ వస్తున్నాయి. గతంలో కాలక్షేపానికి, పఠనాసక్తిని రేకెత్తించడానికి ఉపయోగపడిన గ్రంథాలయాలు నేడు విద్యార్థులను ఉన్నత ప్రమాణాలు కలిగిన విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంలోను, ఉద్యోగార్థులకు విజయాలను అందించే జ్ఞాన దీపికలుగా ఉపయోగపడుతున్నాయి. ఈ నేపథ్యంలో నేటి నుంచి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 56వ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభంకానున్నాయి.

వారం రోజులు ప్రత్యేక కార్యక్రమాలు

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వారం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 14న ప్రారంభోత్సవాలతో పాటు బాలల దినోత్సవాలు నిర్వహించనున్నారు. 15న ఆయా గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శనలు ఏర్పాటు చేయడంతో పాటు మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలు, పుస్తక పఠనం ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. 16న గ్రంథాలయోద్యమానికి విశేషంగా కృషి చేసిన ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకట రమణయ్య తదితర ప్రముఖులకు నివాళి కార్యక్రమాలు ఉంటాయి. 17న రచయితల సందేశాలు, వివిధ అంశాలపై సదస్సులు, కవి సమ్మేళనాలు నిర్వహిస్తారు. 18న విద్యార్థులకు వక్తృత్వం, చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్, క్రీడా పోటీలు నిర్వహిస్తారు. 19న దిశ చట్టం, మహిళా సాధికారతపై చర్చా కార్యక్రమాలు నిర్వహిస్తారు. 20న డిజిటల్ గ్రంథాలయాల వినియోగంపై ఓరియంటేషన్ కార్యక్రమం, స్వీయ పఠన కార్యక్రమం అనంతరం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాలు నిర్వహించి వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు.

జిల్లాలో 77 గ్రంథాలయాలు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా మొత్తం 77 గ్రంథాలయాలు, 89 పుస్తక పంపిణీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఏలూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయం, 5 ప్రథమ శ్రేణి గ్రంథాలయాలు, 2 ద్వితీయ శ్రేణి గ్రంథాలయాలు, 66 తృతీయ శ్రేణి గ్రంథాలయాలు ఉన్నాయి. వీటిలో 58 గ్రంథాలయాలు సొంత భవనాల్లో ఉండగా 8 గ్రంథాలయాలు అద్దె లేని ఉచిత భవనాల్లో, మరో 8 గ్రంథాలయాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 74 గ్రంథాలయాల్లో 10,38,253 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఆయా గ్రంథాలయాల్లో 1,16,801 మంది సభ్యులున్నారు. ప్రతీ రోజూ 5,573 పుస్తకాలను పాఠకులు ఇళ్ళకు తీసుకువెళ్ళి చదువుతున్నారు. గ్రంథాలయాలను ప్రతీ రోజూ సుమారు 15,330 మంది పాఠకులు సందర్శిస్తున్నారు. ఈ-గ్రంథాలయ సాఫ్ట్‌వేర్ ద్వారా పుస్తకాలు డిజిటలైజేషన్ చేసి ఆన్‌లైన్ ద్వారా సభ్యులకు పుస్తకాలు ఇళ్లకు ఇస్తున్నారు. గ్రంథాలయానికి వచ్చిన పాఠకులకు ఫ్రీ ఆన్‌లైన్ సర్వీస్, బ్రిటిష్ ఇండియా డిజిటల్ లైబ్రరీ సర్వీస్ ద్వారా పుస్తకాలను ఆన్‌లైన్‌లో చదివే సౌకర్యం కల్పించారు. విద్యార్థులకు, పోటీ పరీక్షలు రాసేవారికి అనువుగా ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించారు.

నిధులు మంజూరు : గ్రంథాలయ వారోత్సవాలు విజయవంతంగా నిర్వహించడానికి జిల్లా గ్రంథాలయ సంస్థ నిధులు మంజూరు చేసింది. జిల్లా కేంద్ర గ్రంథాలయానికి రూ.35 వేలు, ప్రధాన మున్సిపాలిటీల్లో ఉన్న ప్రథమ శ్రేణి గ్రంథాలయాలకు రూ.15 వేలు చొప్పున, మున్సిపాలిటీల్లో ఉన్న ద్వితీయ శ్రేణి గ్రంథాలయాలకు రూ.11 వేలు చొప్పున నిధులు మంజూరు చేశారు. వీటితో పాటు మున్సిపాలిటీల్లో లేని ద్వితీయ శ్రేణి గ్రంథాలయాలకు రూ.8 వేలు చొప్పున, మండల కేంద్రాల్లో ఉన్న తృతీయ శ్రేణి గ్రంథాలయాలకు రూ.6 వేలు చొప్పున, మండల హెడ్ క్వార్టర్స్‌లో లేని తృతీయ శ్రేణి గ్రంథాలయాలకు రూ.5 వేల చొప్పున నిధులు మంజూరు చేశారు. వీటితో ఆహ్వానపత్రాలు ముద్రించుకోవడం, ఫ్లెక్సీలు, బ్యానర్లకు వినియోగించడం, మైక్‌సెట్టుకు, ఫొటోలకు, వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులుగా ఇచ్చే పుస్తకాలకు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

రాయకుదురులో తొలి గ్రంథాలయం

వీరవాసరం: గ్రంథాలయోద్యమ స్ఫూర్తితో కాళ్లకూరి నరసింహం తన అమ్మమ్మ ఊరు వీరవాసరం మండలం రాయకుదురులో 1894లో జిల్లాలోనే తొలిసారిగా సుజ్ఞానంద గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 100 మంది సభ్యులతో 24 పత్రికలు 2,659 గ్రంథాలు, పుస్తకాలతో ప్రారంభమైన రాయకుదురు గ్రంథాలయం 1967లో జిల్లా గ్రంథాలయ సంస్థ పరమైంది. పాత గ్రంథాలయ భవనం శిథిలమవడంతో దివంగత ధూళిపాళ వేణుగోపాలకృష్ణమూర్తి ఆధ్వర్యంలో నూతన భవనాన్ని నిర్మించారు. ఇక్కడ పురాతన గ్రంథాలు ఇప్పటికీ భద్రంగా ఉన్నాయి. ప్రస్తుతం 808 మంది సభ్యులతో 22 పత్రికలు, 15,226 పుస్తకాలతో సేవలందిస్తోంది. గత ఏప్రిల్‌లో గ్రంథాలయంలో ఇంటర్నెట్ సదుపాయం కల్పించారు. గంటలకు రూ.5 చెల్లించి ఇంటర్నెట్ వినియోగించుకోవచ్చు.



రాయకుదురులోని గ్రంథాలయం

శ్రీవారి దేవస్థానం ఉద్యోగి సస్పెన్షన్

ద్వారకాతిరుమల: శ్రీవారి ప్రసాదాల తయారీలో వినియోగించాల్సిన సరుకుల్లో జరిగిన అవకతవకలపై ఆలయ సీనియర్ అసిస్టెంట్ కె.రాంబాబును దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు సస్పెండ్ చేశారు. ఒక ఏఈఓ, ఇద్దరు సూపరింటెండెంట్‌లను వివరణ కోరుతూ వారికి నోటీసులిచ్చారు. శ్రీవారి ఆలయ కార్యాలయంలో స్వామివారి నివేదనకు, భక్తులకు అందించే ఉచిత ప్రసాదాల తయారీకి వినియోగించే సరుకులు ఇటీవల మాయమైనట్టు ఆలయ అధికారులు గుర్తించారు. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు 80 కేజీల కందిపప్పు, 14 కేజీల జీడిపప్పు మాయమైనట్టు తేల్చారు. గత రెండు నెలలుగా కార్యాలయంలో స్టాక్ రిజిస్టర్ మెయింటినెన్స్ చేయడం లేదని గుర్తించారు. దాంతో స్వామివారికి భక్తులు ఏం సరుకులు అందించారు, వాటిని ఎలా వినియోగించారనే దానికి లెక్కలు లేవు. వీటిపై ఇంకా విచారణ కొనసాగుతోంది. కోనసీమజిల్లా అన్నవరం దేవస్థానం నుంచి బదిలీపై వచ్చిన సీనియర్ అసిస్టెంట్ కె.రాంబాబును ఈ అవకతవకలకు సంబంధించి రెండు రోజుల క్రితం సస్పెండ్ చేస్తూ ఆలయ ఈఓ త్రినాథరావు ఉత్తర్వులు జారీ చేశారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

17న నూజివీడు రానున్న సీఎం జగన్



సీఎం పర్యటనకు ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు, సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

నూజివీడు: నూజివీడులో ఈ నెల 17న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సోమవారం పరిశీలించారు. మైలవరం రోడ్డులోని పెట్రోలు బంకు సమీపంలో ఏర్పాటు చేసే హెలిప్యాడ్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. హెలిప్యాడ్ వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. విస్సన్నపేట రోడ్డులోని ముఖ్యమంత్రి సభను నిర్వహించే మామిడి పరిశోధన స్థానం పక్కనే ఉన్న సభాస్థలిని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజలు పెద్ద ఎత్తున వస్తారని కూర్చునేందుకు కనీసం 20 వేల కుర్చీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు ఎక్కడికక్కడ మంచినీటి సదుపాయాన్ని కల్పించాలన్నారు. పార్కింగ్ స్థలాల నుంచి సభా ప్రాంగణానికి వచ్చే ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అనంతరం అన్నవరం క్రికెట్ గ్రౌండ్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. దాదాపు 400 నుంచి 500 బస్సులలో ప్రజలు సభకు వస్తున్నందున బస్సులన్నీ ఆగేందుకు ఎంపిక చేసిన స్థలంలోని పొదలను, పిచ్చి చెట్లను యుద్ధప్రాతిపదికన తొలగించే పనులు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సమయంలో విస్సన్నపేట వైపు నుంచి హనుమాన్ జంక్షన్ వైపు నుంచి వచ్చే ట్రాఫిక్‌ను మళ్లించాలన్నారు. పట్టణంలోని మైలవరం రోడ్డులోని హెలిప్యాడ్ వద్ద నుంచి సభా ప్రాంగణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రత్యేక బస్సులో వస్తారని.. పెద్ద గాంధీబొమ్మ సెంటర్ వద్ద నుంచి బైపాస్ రోడ్డు వరకు ఎక్కడా కూడా గుంతలు లేకుండా రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

23 కిలోల గంజాయి స్వాధీనం



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి

తాడేపల్లిగూడెం అర్బన్: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 23 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకొన్నట్లు పట్టణ ఎస్సై కె సుధాకరరెడ్డి సోమవారం తెలిపారు. ఎస్పీ యు.రవిప్రకాష్, డీఎస్పీ శరత్ రాజ్‌కుమార్ ఆదేశాల మేరకు సీఐ ఎస్ఎస్‌వీ నాగరాజుకు వచ్చిన పక్కా సమాచారంతో తనిఖీలు నిర్వహించినట్లు ఎస్సై సుధాకరరెడ్డి తెలిపారు. పట్టణ శివారు పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో గంజాయి తరలిస్తున్న షేక్ అక్బర్, ఓరుగంటిపాలెం రాజు అనే ఇద్దరు వ్యక్తులను ఆదివారం అరెస్టు చేసి వారి నుంచి 23 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. వీరిని కోర్టులో హాజరు పర్చనున్నట్లు చెప్పారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. యువత తమ జీవితాలను సన్మార్గంలో తీర్దిదిద్దుకోవాల్సిన బాధ్యత వారిపైనే ఉందన్నారు. ఆయన వెంట ఎస్సై జీజె ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ జి.శ్రీను, కానిస్టేబుళ్లు సి.శ్రీనివాసరావు, కె.రాజు, కె.మహేష్ ఉన్నారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

కొయ్యలగూడెం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ళ భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. జీవో నెంబర్ 25 ద్వారా అతిరాస కులస్తులకు, మరో పదిహేడు కులాల వారికి రాష్ట్రంలో ఎక్కడ ఉన్నా బీసీ–డీగా కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాల్సిందిగా ఈ నెల పదో తేదీన జీవో జారీ చేశారన్నారు. రాష్ట్రంలో ఉన్న మొత్తం 18 కులాలు ఈ జీవో వల్ల బీసీ–డీ కుల ధ్రువీకరణ పత్రాలు పొందడానికి సాంకేతిక సమస్యలు తొలగాయన్నారు. ఈ విషయంలో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ప్రత్యేక శ్రద్ధ కనబరిచారని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం జగన్‌మోహన్‌రెడ్డి మాట నిలుపుకున్నారని వచ్చే సార్వత్రిక ఎన్నికలలో పద్దెనిమిది కులాల వారు వైఎస్సార్‌సీపీ పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్



ఏలూరులో ట్రాఫిక్ సమస్యపై సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఐజీ అశోక్‌కుమార్


ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని, నిబంధనలు పాటించకుంటే చర్యలు చేపట్టాలని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ చెప్పారు. ఏలూరు డీఐజీ క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం ఏలూరు ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. నగరంలో చేపట్టాల్సిన చర్యలపై ఆదేశాలిచ్చారు. డీఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. ఏలూరులో ట్రాఫిక్ నిర్వహణకు సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రజలకు ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనాల వేగ నియంత్రణకు సూచనలు చేయాలన్నారు. నగరంలోని ప్రధాన కూడళ్ళలో ట్రాఫిక్ సిగ్నళ్ల సక్రమంగా వినియోగిస్తూ వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలు తమ గమ్యస్థానాలకు సురక్షితంగా ప్రయాణిస్తూ, ఇళ్ళకు క్షేమంగా చేరేలా పోలీస్ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలన్నారు. ఏలూరులో ప్రజాప్రతినిధులు, ప్రముఖ వ్యక్తులు, వీఐపీలు రాకపోకల సమయంలో అన్ని వైపులా ట్రాఫిక్ నిలిపివేయటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారని, అలా కాకుండా వారు వెళ్ళే మార్గం మాత్రమే రోడ్డు క్లియర్ చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. కాలేజీలు విడిచిపెట్టే సమయంలో రద్దీ ఉండే ప్రాంతాల్లో ఎక్కువ మంది సిబ్బందిని నియమించి, ట్రాఫిక్ సమస్యను అధిగమించాలని డీఐజీ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తూ ఉండాలన్నారు. డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, ట్రాఫిక్ సీఐ కేవీఎస్ వరప్రసాద్, ఎస్ఐలు శ్రీధర్, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

15న భీమవరంలో పోలీసులకు డెంటల్ శిబిరం

సాక్షి, భీమవరం: జిల్లాలోని పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు ఈనెల 15న ఉచిత డెంటల్ మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ యు.రవిప్రకాష్ తెలిపారు. భీమవరం పట్టణంలోని డీఎన్నార్ కళాశాల రోడ్డులోని 32 డెంటల్ కేర్ ఆసుపత్రిలో బుధవారం ఉదయం 10 గంటలకు క్యాంపు ప్రారంభమవుతుందన్నారు.

క్లుప్తంగా

పంట కాలువల్లో మహిళల మృతదేహాలు లభ్యం


కదలి శశిరేఖ (ఫైల్)

నరసాపురం రూరల్: వేర్వేరు ప్రాంతాల్లోని పంటకాలువల్లో వృద్ధులైన ఇద్దరి మహిళల మృతదేహాలు లభ్యమయ్యాయి. మొగల్తూరు మండలంలోని వారతిప్ప కాలువలో సోమవారం గుర్తు తెలియని మహిళ మృతదేహం కనిపించగా, స్థానికులు మొగల్తూరు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీస్ సిబ్బంది వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. ఈ నెల 10వ తేదీన భీమవరం పట్టణానికి చెందిన కదలి శశిరేఖ (90) ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారతిప్పలో లభ్యమైన మృతదేహం శశిరేఖదిగా గుర్తించినట్లు ఇన్‌చార్జి ఎస్సై గురవయ్య తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేస్తామని పోలీసులు తెలిపారు.

పెదమామిడిపల్లిలో..


దిద్ల కమల (ఫైల్)

పాలకొల్లు అర్బన్: పెదమామిడిపల్లిలోని పంటబోదెలో వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. నరసాపురం మండలం మల్లవరం లంకకు చెందిన దిద్ల కమల (60) మతి స్థిమితం కోల్పోయింది. రెండు రోజుల క్రితం ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. చుట్టుపక్కల గ్రామాల్లో, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆమె ఆచూకీ దొరకక నరసాపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం పెదమామిడిపల్లి పంటబోదెలో మృతదేహం లభ్యమైన విషయాన్ని కుమారులకు తెలియజేయడంతో వారు వచ్చి తల్లి మృతదేహాన్ని గుర్తించారు. పెదమామిడిపల్లి వీఆర్వో పాలంకి భుజంగరావు ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై ఎస్.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్ట్

ద్వారకాతిరుమల: జి.కొత్తపల్లి శివారులోని ఓ తోటలో పేకాట శిబిరంపై ఆదివారం దాడి చేసి పది మంది జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్సై టి.సుధీర్ చెప్పారు. వారి నుంచి రూ.37,100 నగదు, 7 బైక్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆహ్లాదం.. కార్తీక విహారం

కార్తీకమాసంలో పుణ్యక్షేత్రాలే కాదు.. పర్యాటక ప్రాంతాలకూ యాత్రికుల తాకిడి ఎక్కువే. భక్తితో పాటు ఆహ్లాదాన్ని అందించే అనేక ఆధ్యాత్మిక, ఆహ్లాదకరమైన ప్రదేశాలు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అనేకం ఉన్నాయి. ప్రస్తుతం కార్తీకమాసం మంగళవారం నుంచి ప్రారంభం కావడంతో పర్యాటకులు ప్రముఖ ఆలయాల సందర్శనతో పాటు విహారయాత్రలకు సిద్ధమవుతున్నారు. చలికాలం కూడా ప్రారంభం కావడంతో అందమైన పర్యాటక ప్రాంతాలు ఎక్కడున్నాయో అని ఆరా తీస్తున్నారు. జిల్లాలో అందమైన, ఆహ్లాదకరమైన ప్రదేశాలతోపాటు ఆధ్యాత్మిక దేవాలయాలవైపు ఒక లుక్కేద్దాం.

- ఉమ్మడి జిల్లాలో పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలు
- గోదావరి నదిలో ప్రారంభమైన బోటు ప్రయాణం
- మన్యంలో కనువిందు చేస్తున్న ప్రకృతి సోయగాలు
- నేటి నుంచి ప్రారంభం కానున్న కార్తీకమాసం సందడి

బుట్టాయగూడెం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో చెప్పుకోదగ్గ పర్యాటక ప్రాంతాలు అనేకం ఉన్నాయి. కొల్లేరు సరస్సు, గుంటుపల్లి గుహలు, పాపికొండల యాత్ర, పట్టిసీమ, మొగల్తూరు బీచ్, పశ్చిమ ఏజెన్సీలో అందాలు చూపరులకు కనువిందు చేస్తున్నాయి. జాలువారుతున్న జలపాతాలు, కొండలను తాకుతున్న మేఘాలు తదితర ప్రకృతి రమణీయ దృశ్యాలు మనసును దోచుకుంటాయి. జల్లేరు జలాశయం, ముంజులూరులోని ఏనుగు తోగు జలపాతం, గుబ్బల మంగమ్మ సన్నిధి, పోగొండ రిజర్వాయర్ పిక్‌నిక్ స్పాట్‌లుగా ఉన్నాయి. ఏటా కార్తీకమాసంలో లక్షలాది మంది పర్యాటకులు ఆయా ప్రాంతాల్లో వనభోజనాలను ఏర్పాటు చేసుకుంటూ ఆనందంగా గడుపుతారు.

గోదావరిలో విహారం చక్కటి అనుభూతి

కార్తీకమాసంలో పాపికొండల యాత్రకు వెళ్లేవారి సంఖ్య అధికంగా ఉంటుంది. ముఖ్యంగా శని, ఆదివారాల్లో యాత్రికుల తాకిడి ఎక్కువ. ఈ ఏడాది అధిక వర్షాలతో గోదావరి వరద ఉధృతంగా ఉండటంతో బోటు ప్రయాణాలను పర్యాటక శాఖ నిలిపివేసింది. అయితే గోదావరి తగ్గుముఖం పట్టడంతో పాటు కార్తీకమాసం ప్రారంభం కావడంతో పర్యాటక శాఖ తిరిగి పాపికొండల విహారయాత్రకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. దేవీపట్నం మండలం గండిపోచమ్మ ఘాట్ నుంచి పాపికొండల విహారయాత్రకు పర్యాటక శాఖ సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది.

సందర్శన స్థలాలు

పాపికొండల విహారయాత్రలో భాగంగా ఇసుక తిన్నెలపై కొలువైన పట్టిసీమ వీరభద్రస్వామి, మహానందీశ్వరస్వామి ఆలయాలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని దేవీపట్నం మండలంలోని గండిపోచమ్మగుడి, బ్రిటిష్ కాలపు పోలీస్ స్టేషన్, 11వ శతాబ్దం నాటి ఉమాచోడేశ్వర స్వామి ఆలయం, కొరుటూరులో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన కాటేజీలు, పేరంటాలపల్లి ఆశ్రమాన్ని సందర్శించుకోవచ్చు. గోదావరి వెంబడి గట్లపై దర్శనమిచ్చే గిరిజన గ్రామాల్లోని ఇళ్లు పర్యాటకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తాయి. గోదావరి నదిపై నిర్మించిన పోలవరం ప్రాజెక్టు కూడా పర్యాటకుల మనస్సును దోచుకుంటుంది.

కొల్లేరు సరస్సు


పూర్వ పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల సరిహద్దులో ఉన్న కొల్లేరు సరస్సు ప్రకృతి అందాలకు, అరుదైన వలస పక్షులకు నిలయంగా ఉంది. కొల్లేరు అందాలను తిలకించేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఈ ఏడాది కార్తీకమాసంలో ఆయా ప్రదేశాల్లో కార్తీక వన సమారాధన ఏర్పాటు చేసుకునే విధంగా పర్యాటకులు సన్నాహాలు చేసుకుంటున్నారు.

పేరుపాలెం బీచ్

పేరుపాలెం బీచ్ కార్తీకమాసంలో పర్యాటకులతో నిండిపోతుంది. సముద్ర స్నానానికి అనుకూలంగా ఉంటుంది. గుర్వాయిగూడెంలోని మద్ది ఆంజనేయ స్వామిని యాత్రికులు అధికంగా దర్శించుకుని పిక్‌నిక్‌లతో సందడి చేస్తుంటారు. భీమవరంలోని గునుపూడిలోని ఉమాసోమేశ్వర జనార్దనస్వామి, పాలకొల్లులోని క్షీరారామలింగేశ్వర స్వామి వంటి పంచారామక్షేత్రాలు ఉన్నాయి. ఇక్కడ కూడా కార్తీక మాసంలో భక్తులు వేలాదిమంది తరలివచ్చి స్వామివార్లను దర్శించుకుంటారు.


గోదావరిలో ఇసుక తిన్నెలపై ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన కాటేజీలు


వలస పక్షుల కిలకిలరావాలతో సందడిగా ఉన్న కొల్లేరు సరస్సు



ముంజులూరు వద్ద ఏనుతోగు జలపాతం

చరిత్రకు సాక్ష్యాలు.. గుంటుపల్లి గుహలు

చింతలపూడి/కామవరపుకోట: గుంటుపల్లి బౌద్ధగుహలు జిల్లాలో చరిత్రకు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం జీలకర్రగూడెం గ్రామం గుంటుపల్లి వద్ద క్రీస్తు పూర్వం మూడో శతాబ్దంలో బౌద్ధారామాల్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. ఈ ప్రాంతంలో కొండను తొలిచి బౌద్ధ స్థూపాలు, చైత్యాలు, కట్టడాలు అనేకం నిర్మించారు. బౌద్ధ సన్యాసులు కూర్చోవడానికి, ధ్యానం చేయడానికి కట్టిన గదులు ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉండటం విశేషం. ఇక్కడ కొండపైన వివిధ ఆకృతులతో గుండ్రంగా సుమారు 60 వరకూ మొక్కుబడి స్థూపాలు ఉన్నాయి. ఈ పర్వతం సర్పాకారంలో ఉండటంతో మహానాగ పర్వతం అనికూడ పిలుస్తారు. ఇక్కడి బౌద్ధగుహలను ఏటా బౌద్ధ సన్యాసులు వచ్చి సందర్శించి వెళుతుంటారు. కార్తీక మాసంలో అధిక సంఖ్యలో పర్యాటకులు వనభోజనాలు చేస్తూ సాయంకాలం వరకు ఇక్కడ ఆహ్లాదంగా గడుపుతారు.

ధర్మలింగేశ్వరస్వామి ఆలయ విశిష్టత

ఇక్కడి గుహను ప్రజలు ధర్మలింగేశ్వరస్వామి ఆలయంగా భావిస్తుంటారు. ఇక్కడి రాతిపై భీముని పాదం ఉన్నట్లు స్థానికులు భావించి పూజలు చేస్తుంటారు. ధర్మలింగేశ్వరస్వామికి ప్రాణాచారం పడితే సంతానం కలుగుతుందని మహిళల నమ్మకం. ఈ కారణంగా మహిళలు అధిక సంఖ్యలో ఇక్కడికి వచ్చి ప్రాణాచారం పడుతుంటారు. కార్తీక మాసంలో నిర్వహించే తిరునాళ్ళకు గట్టు తీర్థంగా పేరుంది. ఈ మాసం మూడో శనివారం, సోమవారం భక్తులు వేల సంఖ్యలో వస్తారు.


గుంటుపల్లిలోని బౌద్ధ గుహలు

దళితులపై దాడులు చేస్తే శిక్షలు తప్పవు

- చినకాపవరంలో దళితులపై దాడి ఘటనపై డీఎస్పీ, ఆర్డీఓ చర్యలు భేష్
- ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనంద్ ప్రకాష్
- గ్రామంలో బాధిత దళితులు, కుటుంబాలకు పరామర్శ


చినకాపవరంలో బాధిత దళితులను పరామర్శిస్తున్న చెల్లెం ఆనంద్ ప్రకాష్

ఆకివీడు: దళితులపై దాడులు చేస్తే కఠిన శిక్షలు తప్పవని ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనంద్ ప్రకాష్ అన్నారు. చినకాపవరంలో అగ్రవర్ణాల దాడిలో గాయపడిన దళితులను సోమవారం గ్రామానికి వెళ్లి బాధితుల్ని, వారి కుటుంబాల్ని పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ గ్రామంలో సువార్త దండయాత్ర కార్యక్రమంలో పాల్గొన్న వారిని అడ్డుకున్నారని, కులం పేరుతో దూషించారని వాపోయారు. గ్రామంలో కొంత మంది అగ్రవర్ణ వ్యక్తులు తమపై కులవివక్షత చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆనంద్ ప్రకాష్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్లపై, చట్టాలపై కొంత మందికి అవగాహన లేదన్నారు. అగ్రవర్ణాలకు చెందినవారికి అట్రాసిటీ చట్టాలపై అవగాహన కల్పించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. గ్రామంలో దళితులపై జరిగిన దాడికి డీఎస్పీ శ్రీనాథ్ సరైన సెక్షన్లతో కేసు నమోదు చేశారని చెప్పారు. డీఎస్పీ, ఆర్డీఓ చర్యలను ప్రకాష్ అభినందించారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో దళితులకు అన్యాయం జరగదన్నారు. అందరికీ న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దళితపేటలో రోడ్డు నిర్మాణానికి జెడ్పీ నిధులు మంజూరు చేయించామని జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు (యండగండి శ్రీను) ప్రకాష్ దృష్టికి తీసుకువచ్చారు. ఎస్సీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ జిల్లా సభ్యులు జిల్లెల్ల సత్యసుధామ, డీఎస్పీ శ్రీనాథ్, ఆర్డీఓ శ్రీనివాసులు రాజు, తహసీల్దార్ విజయలక్ష్మి, ఆకివీడు సీఐ సత్యనారాయణ, ఎస్సై నాగబాబు పాల్గొన్నారు.

శాంతి కమిటీ ఏర్పాటుకు ఆదేశం

చినకాపవరం దళితులపై జరిగిన దాడి ఘటన పోలీసుల చర్యలతో పరిష్కారమైందని ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనంద్ ప్రకాష్ అన్నారు. ఆకివీడు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో చినకాపవరం సంఘటనపై ఆయన స్పందించారు. ప్రకాష్ మాట్లాడుతూ భీమవరం డీఎస్పీ శ్రీనాథ్, ఆర్డీఓ శ్రీనివాసులు రాజు తీసుకున్న చర్యల్ని అభినందించారు. రాష్ట్రంలో దళితులపై ఇటీవల కాలంలో దాడులు తగ్గాయన్నారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు ప్రభుత్వం రూ.167 కోట్లు సహాయం అందజేసిందన్నారు. చినకాపవరం ఘటనపై శాంతి కమిటీ వేసి అవగాహన కల్పించాలని ఆర్డీఓకు సూచించారు. కేసు తేలేవరకూ ఎస్సీ కమిషన్ అండగా ఉంటుందని చెప్పారు. అట్టడుగు వర్గాలకు, దళితులకు అవసరమైతే అగ్రవర్ణాల వారు సహాయం చేసి మానవత్వాన్ని చాటుకోవాలన్నారు. కుల వివక్ష పోవాలన్నారు. డీఎస్పీ శ్రీనాథ్ మాట్లాడుతూ చినకాపవరం సంఘటనలో దాడులకు పాల్పడిన వారిపై ఆయా సెక్షన్ల ద్వారా కేసులు నమోదు చేశామని, శాంతి నెలకొనే వరకు గ్రామంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఆర్డీఓ శ్రీనివాసులు రాజు మాట్లాడుతూ చినకాపవరంలో ఘటనపై పోలీసులు సకాలంలో స్పందించి తీసుకున్న చర్యలు మంచి ఫలితాలను ఇచ్చాయన్నారు. సమావేశంలో తహసీల్దార్ విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు వేగేశ్న వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

9 మందిపై కేసు నమోదు.. ఇద్దరి అరెస్టు

చినకాపవరంలో ఈ నెల 11వ తేదీ రాత్రి దళితులపై జరిగిన దాడి ఘటనలో తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగబాబు సోమవారం చెప్పారు. వీరిలో సిద్దంశెట్టి బాలాజీ, కసిలెంక శివలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. మరో ఏడుగురు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామన్నారు. సువార్త దండ యాత్రలో పాల్గొన్న తమపై దాడి చేశారని తరటావ గ్రామానికి చెందిన కోట వెంకట స్వామి ఫిర్యాదు చేశారని, డీఎస్పీ శ్రీనాథ్ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

ఆర్చరీలో విశ్వకవి విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: ఆర్చరీ పోటీల్లో ఆల్ ఇండియా ఫస్ట్ సాధించడంతోపాటు మూడు క్యాటగిరీల్లోనూ గోల్డ్ మెడల్స్ సాధించడం అభినందనీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. విశ్వకవి స్కూల్ విద్యార్థులు ఎం.సుహాస్, గుంజన్ శర్మ ఇటీవల డెహ్రాడూన్‌లో నిర్వహించిన పోటీల్లో మెడల్స్ సాధించడంపై సోమవారం ఎమ్మెల్యే అభినందించారు. స్కూల్ డైరెక్టర్ పొట్లూరి రఘుబాబు మాట్లాడుతూ సుహాస్ ఆర్చరీలో ఆల్ ఇండియా ప్రథమస్థానంలో నిలవగా నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ పోటీలలో గుంజన్ శర్మ జిల్లా స్థాయిలో ప్రథమస్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. అనంతరం స్కూల్ తరపున సుహాస్‌కు రూ.50 వేలు శర్మకు రూ.10 వేలు నగదు బహుమతులను శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. ప్రిన్సిపాల్ పూజిత, హెచ్‌ఎం రఘురాం, ఇన్‌చార్జి ప్రశాంతి, ప్రాజెక్ట్ గైడ్ ప్రకాష్, ఆర్చరీ కోచ్ సాహిత్ పాల్గొన్నారు.

దోపిడీ యత్నం కేసులో ఐదుగురి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్


స్వాధీనం చేసుకున్న చెక్క తుపాకీ, కత్తులు

తణుకు: వేల్పూరులో ఈ నెల 8వ తేదీన జరిగిన దోపిడీ యత్నం కేసులో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఐదుగురు యువకులను తణుకు రూరల్ పోలీసులు అరెస్టు చేసినట్లు తాడేపల్లిగూడెం డీఎస్పీ సి.శరత్‌రాజ్‌కుమార్ చెప్పారు. ఆదివారం తణుకులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. దువ్వ గ్రామంలో కార్ఖానా నడుపుతున్న కాంట్రాక్టర్ బలరామ్ వద్దకు ఉత్తరప్రదేశ్ నుంచి మహ్మద్ సాధిక్, ఉస్మాన్ షఫి, షాలేఆలమ్, మహ్మద్ అర్షద్‌లతో పాటు మరో బాలుడు వడ్రంగి పనిచేసేందుకు వచ్చారు. వేల్పూరు గ్రామంలోని బాలాజీనగర్‌కు చెందిన వృద్ధుడు బండా బాబూరావు ఇంట్లో రెండేళ్ల క్రితం వీరిలో కొందరు వడ్రంగి పని చేశారు. దాదాపు మూడు నెలల పాటు అక్కడే పనిచేశారు. అయితే ఇటీవల ఉస్మాన్‌షఫీను తీసుకుని అదే ఇంటికి పాలిష్ పెట్టేందుకు వెళ్లారు. ఇంట్లో వృద్ధ దంపతులు మాత్రమే ఉండటం గమనించిన వీరు షాలేఆలమ్, మహ్మద్ అర్షద్‌లతో పాటు మరో బాలుడు కలిసి బాబూరావు ఇంట్లోకి చొరబడి దోపిడీ చేయాలని నిర్ణయించుకున్నారు. ముందుగా చెక్క తుపాకీ తయారు చేసుకుని ఈనెల 8న సాయంత్రం బాబూరావు ఇంటికి వెళ్లారు. కాలింగ్ బెల్ కొట్టగానే బయటకు వచ్చిన బాబూరావును తమతో తెచ్చుకున్న చెక్క తుపాకీ, కత్తులతో బెదిరించారు. బాబూరావు వారిని ప్రతిఘటించగా, అతనికి స్వల్ప గాయాలయ్యాయి. ఇంతలో బాబూరావు భార్య కేకలు వేయడంతో వీరు పరారయ్యారు. ఘటనపై బాధితులు తణుకు రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రూరల్ సీఐ సీహెచ్ ఆంజనేయులు, ఎస్సై కె.చంద్రశేఖర్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాబూరావు ఇంట్లో సీసీ ఫుటేజీతో పాటు సాంకేతికతను ఉపయోగించి నిందితులు దువ్వలో ఉంటున్నట్లు గుర్తించారు. అయితే వీరంతా ఒక ఇల్లు అద్దెకు తీసుకుని దొంగతనాలకు ప్రణాళిక చేసినట్లుగా తెలిసింది. పక్కా సమాచారంతో నిందితులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి చెక్క తుపాకీ, రెండు కత్తులు, నాలుగు సెల్‌ఫోన్లు, తాడు, ప్లాస్టర్‌లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్ చెప్పారు. హెచ్‌సీ కేవీ సుబ్బారావు, కానిస్టేబుళ్లు జె.అరుణ్‌కుమార్, మలకా శ్రీను, వి.మాధవ్, పీసీఆర్ శ్రీనులను డీఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

క్లుప్తంగా

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ



అయ్యప్పస్వామి వారికి పడిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు: పట్టణంలోని జాతీయ రహదారి ఆనుకుని వేంచేసిన శ్రీశాస్త పంచాయతన అయ్యప్పస్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి వైభవంగా పడి పూజ కార్యక్రమం నిర్వహించారు. గురుస్వామి చలపతి ఆధ్వర్యంలో పూజారి సత్యనారాయణ స్వామి సమక్షంలో అయ్యప్పస్వామి వారికి విశేష అభిషేకాలు, అలంకరణలు జరిగాయి. అనంతరం భక్తులకు అల్పాహారం వితరణ జరిగింది. ఉదయం స్వామివారికి విశేషమైన పంచామృతాలతో అభిషేకం, స్వామివారికి ప్రీతికరమైన అన్నాభిషేకం నిర్వహించారు. దాతలు రాజ్‌కుమార్, బాలాజీ, మోహన్‌బాబు, రాంప్రసాద్, సూర్యప్రకాష్, గుప్తా, గాంధీలు, నాగరాజు, వాసు, రాజేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా గోగులమ్మ ఆలయ వార్షికోత్సవం

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలంలోని కొత్తపాలెంలో వేంచేసి ఉన్న గోగులమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. గతంలో శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని పునఃనిర్మాణం చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మాసం ప్రారంభం కూడా కావడంతో పెద్దెత్తున మహిళలు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మూర్తిరాజుకు ఘన నివాళి

భీమవరం (ప్రకాశంచౌక్): విద్యాదాత, మాజీ మంత్రి చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు 11వ వర్ధంతి పురస్కరించుకుని భీమవరం టూటౌన్‌లోని అడ్డవంతెన దగ్గర ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏఎస్ రాజు హాజరై మూర్తిరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లాలో మూర్తి రాజు వందల ఎకరాల్లో ఎన్నో విద్యాసంస్థలు స్థాపించి ఎంతోమంది పేద విద్యార్థులకు విద్యా ప్రోత్సాహాన్ని అందించారన్నారు. విద్యాసంస్థలు ఏర్పాటు చేయడం వల్ల ఎంతో మంది ఉద్యోగాలు సాధించారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకున్నప్పుడే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో చెరుకువాడ సుబ్రహ్మణ్యం రాజు, వేగేశ్న రంగరాజు, ఇందుకూరి ప్రసాద రాజు, చేకూరి ఝాన్సీ, బుద్ధరాజు వెంకటపతి రాజు, వీవీ రాధాకృష్ణమూర్తి, గొట్టుముక్కల రామరాజు, పాల్గొన్నారు.

ప్రజల్లోకి జగనన్న ప్రగతిపథం

కాళ్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమం, అభివృద్ధి తెలిపేందుకు ప్రజల్లోకి జగనన్న ప్రగతిపథం పేరుతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. పెదఅమిరం పార్టీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం జగనన్న ప్రగతిపథం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ రాష్ట్ర ఐటీ వింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 18న విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై భారీ ర్యాలీ నిర్వహిస్తారన్నారు. గత పాలనలో జరగని అభివృద్ధి తెలియజేస్తూ, గత నాలుగేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన రాష్ట్ర ప్రగతిని వివరించడమే జగనన్న ప్రగతిపథం ముఖ్య ఉద్దేశం అన్నారు. రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి పర్యవేక్షణలో రాష్ట్ర ఐటీ విభాగం చైర్మన్ సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ జరుగుతుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అంటేనే సంక్షేమం, అభివృద్ధి అని కితాబు ఇచ్చారు. రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆర్థికంగా ఆనందంగా ఉన్నారంటే ఆ గొప్పతనం అంతా సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు.

సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలి

భీమవరం: కబడ్డీ, చెడుగుడు తదితర సంప్రదాయ క్రీడలను నేటి యువతకు పరిచయం చేయాలని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అన్నారు. భీమవరం మండలంలోని దిరుసుమర్రులో సెయింట్ పాల్ లూథరన్ దేవాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలు ఆదివారంతో ముగిశాయి. ముఖ్యఅతిథిగా హాజరైన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు మాట్లాడుతూ క్రీడలతో దేహ దారుఢ్యం పెరగడమే కాకుండా మానసిక ఉల్లాసం చేకూరుతుందన్నారు. ప్రతిఒక్కరూ వయసుతో భేదం లేకుండా గంట పాటు క్రీడలు ఆడటం వల్ల ఏ వ్యాధులు దరి చేరకుండా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. గ్రామాలలో క్రీడలు నిర్వహించడం వల్ల క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించవచ్చన్నారు. దేశ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చారన్నారు.

శరవేగంగా 'జల్ జీవన్' పనులు

తణుకు టౌన్: జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా తణుకు నియోజకవర్గంలోని 48 గ్రామాల్లోని తాగునీటి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వీటిని మార్చి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో సిబ్బంది, సంబంధిత యంత్రాంగం సిద్ధంగా ఉంది. జల్ జీవన్ పథకం ద్వారా తణుకు నియోజకవర్గంలో వివిధ గ్రామాల్లో పురాతన కాలం నాటి శిథిలమైన మంచినీటి పైప్‌లైన్ల స్థానంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన హెచ్‌డీపీఈ పైపులతో పాటు కొత్త పైప్‌లైన్లు నిర్మించడంతో పాటు కొత్త కాలనీలకు కూడా మంచినీటి పైప్‌లైన్లు విస్తరించారు. నియోకవర్గంలో జల్ జీవన్ పథకం కింద మొత్తం రూ. 69.19 కోట్లతో 169 పనులు చేపట్టారు. వాటిలో పైప్ లైన్ పునరుద్ధరణకు మొదటి విడతలో రూ. 34.05 కోట్లతో 79 పనులు చేపట్టగా వాటిలో 32 పనులు పూర్తి చేశారు. 46 పనులు వివిధ దశలలో ఉండగా ఒక పని టెండర్ దశలో ఉన్నాయి. రెండో విడతలో రూ. 27.59 కోట్లతో 66 పనులు టెండర్ దశలో ఉన్నాయి. ఆగ్‌మెండేషన్ పనులలో ట్యాంక్‌లు నిర్మాణంలో భాగంగా 4.55 కోట్లతో 24 పనులు మంజూరు కాగా వాటిలో 6 పనులు పురోగతిలో ఉన్నాయి. మొత్తం 169 పనులు మంజూరు కాగా వాటిలో 85 పనులు పురోగతిలో ఉండగా 32 పనులు పూర్తి చేశారు.



తణుకు మండలం దువ్వలో జల్ జీవన్ మిషన్‌లో చేపట్టిన పైప్‌లైన్ పనులు



అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో జల్ జీవన్ మిషన్‌లో నిర్మాణం పూర్తి చేసుకున్న మంచినీటి ట్యాంక్

జగనన్న కాలనీల్లో 75 పనులు పూర్తి

గ్రామాల్లో కొత్తగా ఏర్పడిన జగనన్న కాలనీల్లో తాగునీటి వసతుల కల్పనకు సంబంధించి నియోజకవర్గంలో జల్ జీవన్ మిషన్‌లో రూ. 21.64 కోట్లతో 128 పనుల చేపట్టగా వాటిలో 75 పనులను పూర్తి చేశారు. కాలనీల్లో పూర్తి స్థాయి మంచినీటి సరఫరాలకు సంబంధించిన పనులను పూర్తి చేసినట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. ఆగ్‌మెండేషన్ పనులలో భాగంగా గ్రామంలో అవసరమైన ప్రాంతాల్లో మంచినీటి ట్యాంక్‌ల నిర్మాణం చేపట్టారు. వీటిలో చాలా పనులు చివరి దశకు చేరుకున్నాయి.

జిల్లాలోనే అధిక పనులు



జల్ జీవన్ మిషన్‌లో జిల్లాలోనే అధిక పనులను తణుకు నియోకవర్గంలో చేపట్టాం. పనుల్లో నాణ్యత పాటించాలని తెలిపారు. చేపట్టిన పనులు చాలా వరకూ చివరి దశకు చేరుకోగా, మరికొన్ని పనులు పురోగతిలో ఉన్నాయి.

– పీ శ్రీనివాసరావు, డీఈఈ, గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం తణుకు

జనవరి నాటికి పూర్తి చేయాలి



నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో జల్ జీవన్ మిషన్‌లో చేపట్టిన పనులన్నీ జనవరి నెలాఖరు నాటికి పూర్తి చేయాలి. పనుల్లో నాణ్యతను పాటించాలి. వేసవిలో మంచినీటి ఇబ్బంది లేకుండా ఇప్పటి నుంచే అధికారులు, సిబ్బంది పనులు పూర్తి చేసేందుకు శ్రద్ధ చూపాలి.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి

మంత్రి గృహంలో దీపావళి వేడుకలు

తాడేపల్లిగూడెం అర్బన్ : విజయానికి చిహ్నంగా నిర్వహించే దీపావళి సంబరాలను మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి ఆనందోత్సవాల నడుమ నిర్వహించారు. ప్రతి ఇంటా వరుసగా దీపాలను వెలిగించారు. తొలుత ఇళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నా, పెద్దా అందరూ టపాసులు కాల్చారు. ప్రతి ఇల్లు ఆనందాల హరివిల్లుగా మారింది. దీపావళి పండుగ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సతీసమేతంగా ఆయన స్వగృహం వద్ద దీపావళి వేడుకలు నిర్వహించారు. మంత్రి స్వగృహం వద్ద దీపావళి బాణాసంచాను కాల్చారు. దీపావళి పర్వదినం సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వారి జీవితాల్లో దీపావళి వెలుగులు నిండాలని అభిలషించారు. ఈయనతోపాటు పార్టీ నాయకులు కొల్లాటి బాలాజి తదితరులు పాల్గొన్నారు.



ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దీపావళి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

మంత్రి కారుమూరిని సత్కరించిన బీసీ సంఘ నాయకులు

తణుకు అర్బన్: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును మేలు చేయరా సోదరా బీసీ సంక్షేమ సంఘ ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరిని సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్తీకమాసం సందర్భంగా ఈనెల 30వ తేదీన తణుకు 2వ వార్డులో ఏర్పాటు చేయనున్న కార్తీక వనసమారాధనకు హాజరుకావాల్సిందిగా సంఘ జిల్లా అధ్యక్షుడు రంది అప్పారావు, కార్యదర్శి శ్రీనివాస్‌కుమార్‌లు మంత్రిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు ఎన్.సీతారామరాజు, జిల్లా యూత్ ప్రెశిడెంట్ వినాయక వరప్రసాద్, ఉపాధ్యక్షులు కె.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తణుకులో మంత్రి కారుమూరిని సత్కరిస్తున్న బీసీ సంఘ నాయకులు


అందరికీ ఇళ్ల స్థలాలకు కృషి చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్: పాత్రికేయులు ప్రతి ఒక్కరికీ అక్రిడిటేషన్లతో సంబంధం లేకుండా ఇంటి స్థలం ఇప్పించాలని ఐజేయు జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ కోరారు. సోమవారం తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణను ప్రెస్ క్లబ్ సభ్యులతో కలిసి సోమసుందర్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీవోలో సడలింపులకు కృషి చేయాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగు నిర్ణయం తీసుకుంటామని భరోసానిచ్చారు. ఏపీయుడబ్ల్యూజే జిల్లా నాయకుడు గజపతి వరప్రసాద్, ప్రెస్ క్లబ్ ప్రతినిధులు చిక్కాల రామకృష్ణ, మైలవరపు రవికిరణ్, తమ్మిశెట్టి రంగసురేష్, అడపా సూర్యప్రకాష్, సీనియర్ జర్నలిస్ట్ ఖాదర్ మొహియుద్దీన్, వైవీ.సుబ్బారావు, సరికొండ రవికుమార్ రాజు, పెద్దోజు మురళీ, కే.ఆశీర్వాదరావు, సుందరనీడి లక్ష్మయ్య, తోట ధరణి, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, శీలి రాజు, మేకా ఆదినారాయణ, ఉర్ల బాలకృష్ణ వర్ధన్, సీహెచ్‌డీవీ.కృష్ణ, చిన్నా, శివ పాల్గొన్నారు.



ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు వినతి పత్రం అందజేస్తున్న ఐజేయు జాతీయ కార్యదర్శి సోమసుందర్, ప్రెస్ క్లబ్ సభ్యులు

సర్వాంగ సుందరంగా ముస్తాబైన శైవక్షేత్రాలు





అత్తిలిలో శ్రీఉమాసిద్దేశ్వరునికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం, స్వామివారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

అత్తిలి: కార్తీకమాసం పురస్కరించుకుని మండలంలో శైవక్షేత్రాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ఆలయాలను విద్యుత్ దీపాలను ప్రత్యేకంగా అలంకరించారు. అత్తిలిలోగల శ్రీఉమాసిద్దేశ్వరస్వామివారికి సోమవారం ఏకవార రుద్రాభిషేకం నిర్వహించారు. పార్వతి అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

నేటి నుంచి కొండ్రుప్రోలు శివాలయంలో ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం రూరల్: కార్తీక మాసం సందర్భంగా మండలంలోని కొండ్రుప్రోలు శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి వారి ఆలయంలో మంగళవారం నుంచి స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు రామేశ్వరపు రామలింగేశ్వర శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజులపాటు ప్రతి రోజూ పూజా కార్యక్రమాలు, రుద్రాభిషేకాలు జరుగుతాయన్నారు. భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



తాడేపల్లిగూడెం రూరల్: కొండ్రుప్రోలు గ్రామంలోని శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి

చెస్ శిక్షణ అభినందనీయం

సాక్షి, భీమవరం: పిల్లలు క్రీడాల్లో రాణించడానికి శిక్షణ శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని వైఎస్సార్ సీపీ యువ నాయకుడు గ్రంధి రవితేజ అన్నారు. సోమవారం భీమవరం ఎల్‌హెచ్ టౌన్ హాల్లో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఉచిత ఇంటర్నేషనల్ మాస్టర్ చెస్ కోచింగ్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేటి సమాజంలో పిల్లలు సైతం సెల్‌ఫోన్స్, ఇంటర్నెట్‌లకు ప్రభావితులవుతున్నందున విద్యలో వెనకబడటమే కాక కుటుంబ బాంధవ్యాలు కూడా విచ్ఛిన్నమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ చొరవతో చెస్ ఇంటర్నేషనల్ మాస్టర్ పీడీఎస్ గిరినాథ్‌తో ఆరు గంటల పాటు చెస్‌లో రాణించడానికి క్రీడాకారులకు హై లెవెల్స్‌లో శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గమిని రవి పవన్‌కుమార్, సంయుక్త కార్యదర్శి మైలాపురి మురళి పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న రవితేజ

రానున్న ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): హైదరబాద్‌లో జరిగిన మాదిగల విశ్వరూప ప్రదర్శనకు రాజకీయ లబ్ధికోసమే ప్రధాని మోదీ పాల్గొన్నారని, దాని వల్ల ఒరిగిందేమీ లేదని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు పేర్కొన్నారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ ఏపీలో రానున్న ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని మంగరాజు సూచించారు. ఎస్సీ వర్గీకరణకు ఆద్యం పోసి, మాలలకు వెన్నుపోటుదారుడుగా చంద్రబాబు జీవితాంతం స్థిరస్థాయిగా నిలిచిపోయినట్లు చెప్పారు. చంద్రబాబు స్ఫూర్తితో రాజకీయ లబ్ధి కోసం హైదరాబాద్‌లో మాదిగల విశ్వరూప ప్రదర్శన సభ జరిగిందని, ఈ సభకు ప్రధాని మోదీ పాల్గొనడం శోచనీయమన్నారు. ఈ సమావేశంలో నాయకులు కె.సుధారాణి, అమల్‌దాస్, రాంబాబు, సుశీలబాబు,రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

తణుకు టౌన్: వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే ఎస్సీ రిజర్వేషన్‌ల బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ఏపీ ఎమ్మార్పీయస్ నాయకులు ముప్పిడి విజయరామ్, చెట్టే సుజనరావులు డిమాండ్ చేశారు. సోమవారం తణుకు అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించిన మాదిగల విశ్వరూప సభలో పాల్గొన్న ప్రదాని నరేంద్ర మోదీ వర్గీకరణపై కమిటీ వేస్తానని చెప్పడం మాదిగలను మభ్యపెట్టడమేనన్నారు. వర్గీకరణ అంశంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే నియమించిన కమిటీల రిపోర్టులన్నీ వర్గీకరణకు అనుకూలంగా ఇచ్చాయన్నారు. ఈ శీతాకాల సమావేశాల్లోనే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లుకు చట్ట బద్ధత కల్పించే బాధ్యత మోదీదేనని డిమాండ్ చేస్తూ ఈనెల 30వ తేదీన విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో మాదిగ, రెల్లి, ఇతర ఉప కులాల యుద్ధ భేరి మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ఏపీలోని ఉమ్మడి 13 జిల్లాలకు చెందిన మాదిగలు, ఇతర ఉప కులాల ప్రజలు తరలిరావాలని కోరారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ, పలువురికి గాయాలు

తణుకు: మండలంలోని కొమరవరం గ్రామంలో ఆదివారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురు గాయాలపాలయ్యారు. ఈ ఘర్షణలో ఇరు వర్గాలకు చెందిన చవ్వాకుల వెంకటేశ్వరరావు, బొరుసు కుమారనాగ వెంకట సాయి, కాకి చంద్రశేఖర్, బొంతా సతీష్, డి.శ్యామ్‌లను తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అయితే ఆసుపత్రి వద్ద ఎలాంటి ఉద్రిక్తత చోటు చేసుకోకుండా పోలీసులు పహారా ఉన్నారు. తణుకు రూరల్ సీఐ సీహెచ్ ఆంజనేయులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఇరువర్గాలు ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు కాలేదని తణుకు రూరల్ పోలీసులు తెలిపారు.

షుగర్ వ్యాధి నియంత్రణే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంవీ సూర్యనారాయణరాజు

ఆకివీడు: షుగర్ వ్యాధి నియంత్రణతో ఇబ్బందుల్ని తొలగించుకోవాలని ప్రముఖ వైద్యులు, లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ ఎంవీ సూర్య నారాయణరాజు సూచించారు. ప్రపంచ షుగర్ వ్యాధి నియంత్రణ దినోత్సవం సందర్భంగా మంగళవారం షుగర్ వైద్య శిబిరం, అవగాహన కార్యక్రమాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక లయన్స్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కాలంలో షుగర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతుందన్నారు. లయన్స్ క్లబ్‌లు, మెడికల్ ట్రస్టు, కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యం శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిబిరంలో వ్యాధి నిర్ధారణ రక్త పరీక్షలు, బీపీ, కిడ్నీ సంబంధిత రక్త పరీక్షలు, గుండె, కంటి చూపు పరీక్షలు, ఉచిత కంటి ఆపరేషన్లు, కళ్ళజోళ్ల అందజేస్తామని తెలిపారు. సమావేశంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మోటుపల్లి శ్రీనివాసరావు, ప్రతినిధులు గొంట్లా కృష్ణ, సత్యనారాయణ, సన్నిధి వెంకన్నబాబు, అహ్మద్ పాల్గొన్నారు.

న్యాయం చేయకుంటే ఉద్యమిస్తాం



ఆకివీడులో పుష్పరాజ్‌ను అడ్డుకున్న పోలీసులు

ఆకివీడు: చినకాపవరం గ్రామంలో దళితులపై జరిగిన దాడిలో న్యాయం చేయకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. గ్రామంలోని బాధితుల వద్దకు వెళ్లేందుకు సోమవారం ఆకివీడు వచ్చిన ఆయన్ని గుమ్ములూరు సెంటర్‌లో పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు తీసుకున్న చర్య అభినందనీయమని, బాధితులకు న్యాయం చేకూర్చడమే తమ లక్ష్యమన్నారు. బాధితుల వద్దకు తమను వెళ్ళనివ్వకపోయినా వారికి తగిన న్యాయం చేసే విధంగా కృషి చేస్తామని, నిందితులపై కఠిన శిక్షలు వేసి, అరెస్టులు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆకివీడు, కాళ్ల ఎస్సైలు నాగబాబు, వీరభద్రరావు, పోలీసులు అడ్డుకున్న వారిలో ఉన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా, మండల సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి తూర్పుతాళ్లులో పంచాయతన మహాయజ్ఞం

నరసాపురం రూరల్: నరసాపురం మండలంలోని తూర్పుతాళ్లు గ్రామంలో మంగళవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు శ్రీ విష్ణు పంచాయతన మహాయజ్ఞ కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆగమ పండితులు అరవల్లి జగన్నాధాచార్యులు తెలిపారు. గ్రామంలోని దొరయ్యగారి ఇంటి ఆవరణలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రతి రోజూ ఉదయం సుప్రభాత సేవా కాలం, అనంతరం తిరుప్పల్లాడండు, తిరుప్పావై పారాయణం, గణపతి, ఆదిత్య, రుద్ర హోమాలతో పాటు ప్రతి రోజూ సాయంత్రం విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ, చతుస్థానార్చన, పంచాయతన హోమం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారన్నారు. ఈనెల 17 చండీహోమం, 20వ తేదీన సామూహిక శ్రీనివాస కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు అత్తిలిలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

అత్తిలి: మండలంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం మంగళవారం మధ్యాహ్నం అత్తిలి-3 సచివాలయం పరిధిలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నేడు బీవీఆర్‌లో సంగీత, నృత్య సమాహారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బీవీఆర్‌లో ఈ నెల 14వ తేదీ బాలల దినోత్సవం సందర్భంగా మంగళవారం సాయంత్రం 6 గంటలకు నెలవారీ సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమాహారం నిర్వహిస్తున్నట్లు సభాధ్యక్షులు బుద్దాల వెంకట రామారావు వెల్లడించారు. కళాకారులచే ట్రాక్ సింగింగ్, చిన్నారులచే నృత్య ప్రదర్శనలు, శ్రీకృష్ణదేవరాయ సేవా సంఘం అధ్యక్షులు జంగా శ్రీనివాస రామ్‌రాయ్‌కు గౌరవ పురస్కారం, గాయకుడు తగరంపూడి దుర్గా వెంకట మురళీకృష్ణకు కళారత్న పురస్కారం, రంగస్థల నటీ ఎం.భానుమతికి ఆర్థిక సత్కారం అందజేయనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రముఖులు, కళాకారులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

దస్తావేజులు పడిపోయినవి

పద్దింశెట్టి వి రామాంజనేయులు, తండ్రి : సూర్యనారాయణ వేల్పూరు, తణుకు మండలం, దస్తావేజు నెం.3490/1992 ది.25-08-1992 న రిజిష్టర్ చేయబడిన దస్తావేజు ది.19-10-2023న వేల్పూరు నుండి తణుకు వస్తుండగా దారిలో పడిపోయినవి. దొరికినవారు సెల్ : 63032 94223 కు సమాచారం అందించవలసినదిగా కోరుచున్నాము.

మహారాజ శ్రీ తణుకు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
ఇ.పి.నెం./2023 ఇన్ ఓ.ఎస్.నెం.213/2018

బిట్వీన్ :
గణపవరపు నాగేశ్వరరావు, తండ్రి: సత్యనారాయణ, వేల్పూరు గ్రామం, తణుకు మండలం. .. డి.హెచ్.ఆర్
మరియు
కాకి శ్రీనివాస్, తండ్రి: సత్యానందం వెంకటరాయపురం, తణుకు .. జె.డి.ఆర్

డి.హెచ్.ఆర్. తరపున వేయించిన వేలం ప్రకటన

ఇందు మూలంగా యావన్మందికీ తెలియజేయునది ఏమనగా పై నెంబరు డిక్రీ బాకీ వసూలు నిమిత్తం సదరు జె.డి.ఆర్. తాలూకు ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని శ్రీ కోర్టువారి సమక్షంలో ది.28.11.2023వ సం॥ తేదిన ఉదయం 10.30 ని॥ల లగాయతూ బహిరంగ వేలం జరుగును. కావున కావల్సిన వారు శ్రీ కోర్టువారి షరతులకు లోబడి పాట పాడుకోవలెను.

వేలపు ఆస్తి వివరం

ఎ. షెడ్యూలు: ప॥గో॥జిల్లా,భీమవరం జిల్లా రిజిస్ట్రార్, తణుకు సబ్ రిజిస్ట్రార్,తణుకు మండలం, వెంకటరాయపురం టౌన్‌షిప్ లిమిట్స్, ఇన్ ఆర్.ఎస్.నెం.510/7 నైరుతి మూల విస్తీర్ణం 206 చ॥గ॥లు స్థలం, పూరా ఎ.3-98 సెంట్లు, సదరు డోర్.నెం.9-139,ఆర్.సి.సి. బిల్డింగ్ పై అంతస్థు అందులోని గ్రౌండ్ మరియు మొదటి అంతస్తు దక్షిణం వైపు బిల్డింగ్ మొత్తం 205, చ॥గ॥లు స్థలం తదితర బిల్డింగ్‌కు హద్దులు. తూర్పు: 8గ॥ల వెడల్పు గల పంచాయితీ రోడ్డు 10 1/2 గజాలు, పడమర: అక్కిన వెంకట రావు గారి భూమి 10 గజాలు, ఉత్తరం: కోలవరపు సుబ్రహ్మణ్యం గారి గోడ, దక్షిణం: కోమట్ల కనకమ్మ గారి స్థలం 20 గజాలు. పై హద్దుల మధ్య 80 చ॥గ॥లం అవిభక్తపు వాటా 40 గజాల మినహా ఇదివరలో అమ్మిన ఆస్తి కాకుండా మిగిలిన వాటా సమస్త ఈజ్‌మెంట్ హక్కులతో సహా.

బి.షెడ్యూలు వేలం ఆస్తి వివరం: తూర్పు: ఉమ్మడి కారిడార్ మరియు మెట్లు, పడమర: ఓపెన్ టు స్కై, ఉత్తరం: ఉమ్మడి గోడ శ్యామల మరియు డి.హెచ్.ఆర్., దక్షిణం: ఓపెన్ టు స్కై. పై హద్దుల మధ్య బిల్డింగ్ లో తూర్పు వైపు మొదటి అంతస్తులో దక్షిణం వైపు అనగా నైరుతి మూల బాత్‌రూమ్‌లు మరియు విద్యుత్ ఫిట్టింగ్స్ కరెంట్ మీటర్లతోనెం.13939 ఇతర సమస్త ఈజ్ మెంట్ హక్కులతో సహా.

డి.హెచ్. విలువ రూ.6,00,000/-
మార్కెట్ విలువ రూ.17,96,000/-

ఇవటూరి కిషోర్
అడ్వకేటు,తణుకు, సెల్: 98485 44550
డి.హెచ్.ఆర్. తరపు అడ్వకేట్